క్లుప్తంగా

6న జిల్లా స్థాయి క్విజ్ పోటీలు

కాశీబుగ్గ: మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన సువర్ణాపురం గ్రామంలో అక్టోబర్ ఆరో తేదీన జిల్లాస్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు గ్రామాభివృద్ధి కమిటీ నాయకులు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దుర్గాదేవీ నవరాత్రులు సందర్భంగా నిర్వహించే ఈ పోటీల్లో ఒక పాఠశాల, ఒక ట్యూషన్ సెంటర్ నుంచి ఎన్ని బృందాలైన పాల్గొనవచ్చన్నారు. ఒక్కో బృందానికి వంద రూపాయలు ప్రవేశ రుసుం చెల్లించాలన్నారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం, సైన్స్, సోషల్, జీకే, కరెంట్ అఫైర్స్, మైథాలజీలపై సెప్టెంబర్ వరకు జరిగిన సిలబస్‌పై ఇంగ్లిష్, తెలుగు విభాగాల్లో స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుందన్నారు. వివరాల కోసం 6304544011, 63017 84081, 81060 31305 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఆపస్ మండల అధ్యక్షుడిగా షణ్ముఖరావు


ఎంఈవో శ్రీనివాసరావుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

పలాస: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) పలాస మండల శాఖ అధ్యక్షుడుగా కొయిరి షణ్ముఖరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కీలు సోమేశ్వరరావు పర్యవేక్షణలో సాధారణ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో అధ్యక్షుడుతో పాటు ప్రధాన కార్యదర్శిగా గిన్ని అప్పలరాజుతోపాటు మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం వీరి నియామక పత్రాన్ని ఎంఈవో శ్రీనివాసరావుకు అందజేశారు. కార్యక్రమంలో పలాస మండల ఇన్‌చార్జి బి.శంకరం, వజ్రపుకొత్తూరు మండల ఇన్‌చార్జి ఎం.తారకేశ్వరరావు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీకి తిలక్ పరామర్శ


జానకీరామయ్యను పరామర్శిస్తున్న తిలక్

టెక్కలి: టెక్కలి మాజీ ఎంపీపీ తిర్లంగి జానకీ రామయ్య అనారోగ్యానికి గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ సోమవారం పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శలో పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ సత్తారు సత్యం ఉన్నారు.

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి


గిరిబాబుకు వినతిని అందజేస్తున్న సంతోష్

కాశీబుగ్గ: ఎన్నికల సమయంలో ఎన్‌డీఏ కూటమి ఇచ్చిన హామీ మేరకు రాజీనామా చేయని వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్‌కుమార్ కోరారు. ఈ మేరకు మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబుకు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు.

జంగిల్ క్లియరెన్స్


జంగిల్ క్లియరెన్స్ పనులు చేస్తున్న దృశ్యం

సోంపేట: ఇస్కలపాలెం పంచా యతీ రహదారికి ఇరువైపులా మొక్కలు ఉండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. గ్రామ పంచాయతీ పాలకవర్గానికి ప్రజలు సమస్య తెలియజేసినా పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో జేసీబీ ఏర్పాటు చేసి శ్రమదానంతో సోమవారం జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బైపల్లి తిరుపతి, బైపల్లి రామారావు తదితరు లు పాల్గొన్నారు.

కొత్త వంతెనకు మోక్షం ఎప్పుడో

- ఏడాదిగా తాత్కాలిక వంతెనే దిక్కు
- ప్రతిపాదనలతో కాలయాపన
- వాహనచోదకులకు తప్పని తిప్పలు


కూలిన వంతెనను పరిశీలిస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు (ఫైల్)

ఇచ్ఛాపురం రూరల్:

దశాబ్దాల నాటి వంతెన. ఆంధ్రా–ఒడిశా వాసులను కలిపే వారధి. నిత్యం వేలాది మంది ప్రయాణాలు, వందలాది వాహనాల రాకపోకలకు అనువుగా ఉన్న బహుదా వంతెనను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. లొద్దపుట్టి నుంచి ఇచ్ఛాపురం పట్టణానికి వెళ్లే రహదారిలోని బహుదానదిపై 1929లో బ్రిటీష్ ప్రభుత్వం నిర్మించిన వంతెన ఇప్పుడు శిథిలావస్థకు చేరుకుంది. పదేళ్ల క్రితం వరకు ఇదే వంతెనపై చెన్నై–కోల్‌కత్తా ఎన్‌హెచ్–5 జాతీయ రహదారి ఉండేది. గత ఏడాది మే మూడో తేదీన వంతెన సామర్థ్యానికి మించి సుమారు 70 టన్నుల బరువుతో గ్రానైట్ కంటైనర్ ఈ వంతెనపై వెళ్తుండగా సగ భాగం కుప్పకూలిపోయింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ కృషితో అప్పటి జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సంఘటనా స్థలానికి చేరు


తాత్కాలిక వంతెన

కొని వంతెనకు ప్రత్యామ్నాయంగా తాత్కావిక వంతెన నిర్మించేందుకు రూ.40 లక్షలు మంజూరు చేశారు. అంతేకాకుండా ఆర్‌అండ్‌బీ శాఖ డీఈ ఎస్.రామినాయుడు, ఇంజినీర్లు పాతవంతెన పక్క నుంచి శాశ్వత వంతెన నిర్మాణానికి సుమారు రూ. 20 కోట్లతో అంచనా వేసి ప్రతిపాదనలు పంపించారు. నేటికి 14 నెలలు దాటుతున్నప్పటికీ కొత్త వంతెనపై అటు అధికారులకు, ఇటు ప్రజా ప్రతినిధులకు చిత్తశుద్ధి కరువైంది. ప్రస్తుతం ఈ వంతెనపై ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు మినహా బస్సులు, లారీలు, ట్రాక్టర్లు, మినీ వ్యానులు రాకపోకలు


బహుదానదిపై కూలిన వంతెన (ఫైల్)

సాగించేందుకు అధికారులు నిరాకరిస్తున్నారు. ఇచ్ఛాపురం పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు ఉండటంతో అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు సైతం వెళ్లేందుకు మార్గం లేకుండా పోయింది.

రాకపోకలకు ఇబ్బందులు

ప్రస్తుతం ఈదుపురం బెల్లుపడ మీదుగా అన్ని రకాల వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఊరు మధ్య నుంచి సింగిల్ రోడ్డు ఉండటంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు తప్పించుకునేందుకు డ్రైవర్లు తిప్పలు పడుతున్నారు. భారీ వాహనాలు సైతం ఇదే రహదారి గుండా వస్తుండటంతో మున్సిపాలిటీలో వేసిన కల్వర్టులు, రోడ్లు కుంగిపోతున్నాయి. ఇటీవల సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి విజయవాడలో ఆర్‌అండ్‌బీ ఇంజినీర్ ఇన్ చీఫ్ నయిముల్లాను కలసి కొత్త వంతెన పనులు చేపట్టాలని వినతిపత్రం అందజేశారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వంతెనపై దృష్టి సారించి వీలైనంత తొందరలో నూతన వంతెన నిర్మించాలని ప్రజలు ముక్త కంఠంతో కోరుతున్నారు. విషయంపై స్పందించిన ఆర్‌అండ్‌బి డీఈ ఎస్.రామిరాయుడు మాట్లాడుతూ.. మొదటి విడత టెండర్‌కు పిలిచినప్పటికీ కాంట్రాక్టర్లు ముందుకు రాలేదన్నారు. ఉన్నతాధికారుల సూచనలు మేరకు రెండోసారి టెండర్లు ఆహ్వానిస్తామన్నారు.

చంద్రబాబుకు చెంప పెట్టు

- వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్



టెక్కలి: తిరుమల వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందనే చంద్రబాబు దుష్ప్రచారానికి సుప్రీం కోర్టు చెంప పెట్టుగా ఆగ్రహం వ్యక్తం చేసిందని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. కేవలం ఎన్నికల హామీల నుంచి తప్పించుకోవడానికి కలియుగ దేవుడితో రాజకీయాలు చేసిన చంద్రబాబుకు తగిన గుణపాఠం ఎదురైందన్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా చంద్రబాబు చేసిన కుటిల రాజకీయాల బండారం బయట పడిందన్నారు. లడ్డూ కల్తీ జరిగిందనే చంద్రబాబు దుష్ప్రచారంపై సుప్రీంకోర్టు అడిగిన ప్రశ్నలు ఇప్పుడు సామాన్యుడిలో సందేహాలుగా మారుతున్నాయన్నారు. అమలు చేయలేని హామీలతో ప్రజలను మోసం చేసి ఇప్పుడు వాటి నుంచి తప్పించుకోవడానికి చంద్రబాబు చేస్తున్న కుట్రలు ప్రజల్ని విస్తు గొలుపుతున్నాయని తిలక్ మండిపడ్డారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని ఎన్నికల హామీలను ఎలా అమలు చేయాలనే విషయంపై చంద్రబాబు దృష్టి సారించాలన్నారు. ఇకపై ఎన్నికల హామీల నుంచి తప్పించుకోవడానికి ప్రజల మనోభావాలను నష్టపరిచే విధంగా ఎటువంటి అంశాన్ని తెరపైకి తీసుకువచ్చినా ఎవరూ నమ్మరన్నారు.

జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు


జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

సంతబొమ్మాళి: శ్రీకాకుళంలో సోమవారం నిర్వహించిన మీకోసంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు మేఘవరం పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పి.శ్రీనివాస్‌రెడ్డి పలు సమస్యలపై ఫిర్యాదు చేశారు. చేపట్టిన పారిశుద్ధ్య పనులకు, వీధి దీపాల ఏర్పాటు కోసం చేసిన ఖర్చులకు సంబంధించి బిల్లులు చెల్లించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శిని అడిగితే టీడీపీ నాయకులు వద్దన్నారని చెప్పారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే మేఘవరం సచివాలయం మెట్లు, ఫ్లోరింగ్ ధ్వంసంపై కూడా ఫిర్యాదు చేశారు.

రూ. 20 కోట్లతో మున్సిపాలిటీని అభివృద్ధి చేశాం


సభలో మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు

కాశీబుగ్గ: గత మూడున్నరేళ్లలో పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు చేసుకున్నామని చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. మున్సిపల్ సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. 31 వార్డుల పరిధిలో అనేక అభివృద్ధి పనులకు సభ్యులు డిమాండ్ చేస్తున్నారన్నారు. అయితే ప్రస్తుతం ఖజానా ఖాళీగా ఉందని అంటున్నారని.. కొత్త ప్రభుత్వం ఏర్పాటు నేపథ్యంలో కొద్దిరోజుల్లో ప్రాధాన్యత క్రమంలో పనులు చేసుకుందామని అన్నారు. గృహ నిర్మాణాల విషయంలో ఆ శాఖ అధికారుల సహకారం లేదన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్‌లు బోర క్రిష్ణారావు, మీసాల సురేష్ బాబు, కౌన్సిలర్లు గురిటి సూర్యనారాయణ, దువ్వాడ శ్రీకాంత్, గుజ్జు జోగారావు, బెల్లాల శ్రీనివాసరావు, బమ్మిడి సంతోష్, కమిషనర్ రామారావు పాల్గొన్నారు.

యువజనోత్సవాల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

టెక్కలి: జిల్లా కేంద్రంలో సెట్‌శ్రీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన యువజనోత్సవాల్లో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. చిత్రలేఖనం పోటీల్లో బీఎస్సీ విద్యార్థి పి.ఉదయ్‌కిరణ్ ద్వితీయ స్థానంలో బహుమతి పొందాడు. అలాగే జానపద నృత్యంలో సుస్మిత బృందం ప్రతిభ చూపి బహుమతులు ప్రశంసా పత్రాలు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ వెల్లడించారు. కళాశాల సాంస్కృతిక విభాగం కోఆర్డినేటర్ లీలాపద్మజ, అధ్యాపకులు బి.సతీష్‌కుమార్, కె.గొల్ల తదితరులు విద్యార్థులను అభినందించారు.

న్యాయం చేయాలని దీక్ష

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీలో సర్వే నంబర్ 393లో స్థలం వివాదంలో తనకు న్యాయం చేయాలని పట్టణానికి చెందిన పేకల కృష్ణ స్థానిక తహసీల్దారు కార్యాలయం ఆవరణలో సోమవారం ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమయ్యాడు. తన షాపును ఉద్దేశపూర్వకంగా తొలగించి నడిరోడ్డున పడేశారని.. దీనిపై ఉన్నతాధికారులు ఆదేశించినప్పటికీ పంచా యతీ యంత్రాంగం పట్టించుకోవడం లేదని బాధి తుడు వాపోయాడు. తక్షణమే తనకు న్యాయం చేయకపోతే దీక్షను మరింత ఉధృతం చేస్తానని బాధితుడు హెచ్చరించాడు.

అక్రమంగా బదిలీ చేయడం తగదు

టెక్కలి: టెక్కలి పంచాయతీరాజ్ ఈఈ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న దళిత వర్గానికి చెందిన శోభారాణిని అక్రమంగా బదిలీ చేశారనిపలు దళిత సంఘాల ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. కార్యాలయంలో ఈఈగా పనిచేస్తున్న సూర్యప్రకాశ్ కక్షసాధింపు చర్యతో శోభారాణిని పార్వతీపురం బదిలీ చేయించడం తగదని మండిపడుతున్నారు. ఐదేళ్లు సర్వీసు పూర్తి కాకుండానే శోభారాణిని అక్రమంగా బదిలీ చేయడంపై విచారణ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

వినతులను పరిష్కరించాలి


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శిరీష, అధికారులు

వజ్రపుకొత్తూరు: ప్రజలకు సంబంధించిన సమస్యలపై వినతులు వచ్చినపుడు వాటి పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండల తహసీల్దార్ కార్యాలంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమానికి హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె దృష్టికి వచ్చిన సమస్యలపై అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కంచేందుకు చర్యలు చేపట్టారు. దీర్ఘకాలింగా ఉన్న సమస్యలను వారం రోజుల్లోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారలును ఆదేశించారు. ఈ వారం 15 వినతులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. తహసీల్దార్ పి.బాల, ఎంపీడీవో ఈశ్వరమ్మ, ఉప తహసీల్దార్ వి.గిరిరాజ్ తదితరులు ఉన్నారు.

బదిలీ ఎంపీడీవోకు సత్కారం


రమేష్‌నాయుడును సత్కరిస్తున్న దృశ్యం

పలాస: పలాస ఎంపీడీవోగా పనిచేస్తూ వజ్రపుకొత్తూరు మండలానికి బదిలీపై వెళ్తున్న ఎస్.రమేష్‌నాయుడును బొడ్డపాడ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సోమవారం ఘనంగా సన్మానించారు. ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బొడ్డపాడు సర్పంచ్ తామాడ మదన్, ఎంపీటీసీ సభ్యుడు మద్దిల పాపారావు, పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, పంచాయతీ కార్యదర్శులు మీనాకుమారి, ఫాల్గుణరావు, మాజీ సర్పంచి బొడ్డు సుధాకర్, సరోజవర్మ, విజయ్ పాల్గొన్నారు.

మెప్మా అర్బన్ మార్కెట్ ప్రారంభం


బజార్‌ను ప్రారంభిస్తున్న రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: పురపాలకసంఘం పరిధిలో దినవారి బజారు సమీపంలో మెప్మా అర్బన్ మార్కెట్‌ని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి సోమవారం ప్రారంభించారు. మహిళాసంఘ సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను మెప్మా బజారులో ప్రదర్శనకు ఉంచారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు, వార్డు కౌన్సిలర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారం ప్రదర్శన

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ మెప్మా కార్యాలయంలో సోమవారం పౌష్టిక ఆహార మాసోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం తయారీపై మహిళలకు పోటీలు నిర్వహించి ప్రదర్శించారు. మెప్మా డీసీఎం విజయకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగమ్మ, సీఎంఎం పిన్నింటి మోహనరెడ్డి పాల్గొన్నారు.

కొత్తమ్మతల్లిని దర్శించుకున్న ఆర్డీవో

కోటబొమ్మాళి: పలాస ఆర్డీవో భరత్‌నాయక్ కోటబొమ్మాళి కొత్తమ్మతల్లిని సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో వి.రాధాక్రిష్ణ ఆలయ మర్యాదలతో సత్కరించి అమ్మవారి ఫొటో, ప్రసాదాన్ని అందజేశారు.

విద్యుత్ దీపాల నిర్వహణపై దృష్టి సారించాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ రాజలక్ష్మి


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణంలో విద్యుత్ దీపాల నిర్వాహణ చాలా దారుణంగా ఉందని.. వాటిపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మితో పాటు పలువురు కౌన్సిల్ సభ్యులు కోరారు. చైర్‌పర్సన్ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. సమావేశంలో తొమ్మిది అంశాలతో కూడిన అజెండాపై చర్చించారు. నాన్‌ప్లాన్ గ్రాంట్ నిధుల నుంచి సుమారు రూ. 26 లక్షలతో మున్సిపాలిటీలో మరుగుదొడ్ల మరమ్మతులు, ఎంట్రీరోడ్, కార్యాలయం గేట్ ఏర్పాటు కోసం కౌన్సిల్ ఆమోదం కోసం అధికారులు తీసుకురాగా సభ్యులు తిరస్కరించారు. పురపాలకసంఘం కొత్తమాస్టర్ ప్లాన్ అంశాన్ని వాయిదా వేసి మిగిలిన ఆరు అంశాలను కౌన్సిల్ ఆమోదించింది. నిత్యం రద్దీగా ఉండే ఫకీర్‌పేటరోడ్‌లోని మండపం కూడలి, మున్సిపల్ ప్రాథమిక పాఠశాల సమీపంలో స్పీడ్ బ్రేకర్లను వేయాలని వైస్‌చైర్‌పర్సన్ ఉలాల భారతిదివ్య ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. సయ్యద్‌ఖాన్ చెరువుని బాగుచేయించేలా చర్యలు తీసుకోవాలని 23వ వార్డు కౌన్సిలర్ గువ్వాడ ప్రదీప్ కోరారు. వైస్ చైర్‌పర్సన్–2 లాబాల స్వర్ణమణి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బొరివంక విద్యార్థులు

కవిటి: శ్రీకాకుళం కేంద్రంగా ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ కనబర్చడం ద్వారా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వాలీబాల్‌కు బి.సందీప్, ఖోఖోకు ఎ.లక్ష్మణ్ ఎంపికయ్యారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను హెచ్‌ఎం సనపల రామకృష్ణ, పీఈటీ వి.జగదీశ్వరి సోమవారం అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటి జిల్లాకు పేరు ప్రతిష్టలు పెంపొందించాలని ఆకాంక్షించారు.

బోరుభద్ర విద్యార్థి..

సంతబొమ్మాళి: రాష్ట్రస్థాయి అండర్ –17 కబడ్డీ పోటీలకు బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పరపటి ప్రేమ్‌చంద్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రేమ్‌చంద్‌తోపాటు వ్యాయామ ఉపాధ్యాయులు పి.తిరుపతిరావు, ఎం.సాయిశివానిలను ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.


కంచిలి: జితా నాయక్

కంచిలి: మండపల్లి గ్రామంలోని సీతయ్య ఫౌండేష న్ నిర్వహిస్తున్న వానప్రస్థాశ్రమం హాస్టల్లో ఉంటూ కవిటి మండలం మాణిక్యపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న జితా నాయక్ అండర్–14 విభాగంలో రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈమెను హెచ్‌ఎం సుమలత, పీడీ రవికుమార్, ఆశ్రమ నిర్వాహకుడు గుళ్ల రమేష్ అభినందించారు.


సంతబొమ్మాళి: ప్రేమ్‌చంద్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు


కాశీబుగ్గ: దొక్కరి వర్షిణి

టెక్కలి రూరల్: పొలవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం విలియమ్స్ తెలిపారు. కె.కావ్య, కె.శిరీష, జి.జస్వంత్, జి. భాస్కర్, కె.అభిషేక్, ఎ.వరుణ్‌ర గ్బీ పోటీలకు, బి. నవదీప్, ఎస్.కిశోర్, జి.సంతోష్, ఎస్.ప్రవీణ్, ఎం.గురుప్రసాద్, కాజల్ సాహులు నెట్‌బాల్, వి.కిషోర్ రోప్ స్కిప్పింగ్ పోటీలకు కె.కిరణ్, ఎం.నవీన్, జి.జస్వంత్, ఎస్.కిశోర్, కె.కావ్య, జి.ప్రమిత జూడో పోటీలకు ఎంపికయ్యారు. వీరిని వ్యాయామ ఉపాధ్యాయులు పి.జగదీశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.


కవిటి: విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు


టెక్కలి రూరల్: విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కాశీబుగ్గ: రంగోయి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న దొక్కరి వర్షిణి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఈమెను పీడీ లక్ష్మణరావు, పీఈటీ ప్రేమ్‌చంద్, హెచ్‌ఎం హేమరావు, గ్రామ సర్పంచ్ లక్ష్మీకుమారి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బద్రి వాని, యూత్ అధ్యక్షులు హేమారావు, నాయకులు సూర్య, దేవరకొండ షణ్ముఖరావు, అప్పలస్వామి, కృష్ణారావు అభినందించారు.

సంక్షిప్తంగా...

పాఠశాలకు ఎస్‌బీఐ వితరణ

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ ఏడోవార్డు చిన్నబాడం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా స్థానిక స్టేట్ బ్యాంక్ రూ. ఆరు లక్షలు విలువ చేసే సామగ్రిని అందించారు. రెండు కంప్యూటర్లు, రెండు బీరువాలు, 20 టేబుళ్లు, 20 కుర్చీలు తదితర సామగ్రిని సోమవారం అందించారు. కార్యక్రమంలో బ్యాంక్ చీఫ్ మేనేజర్ వి.సూర్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు ఉషారాణి, మాజీ కౌన్సిలర్ బడ్డ నాగరాజు, ఉపాధ్యాయులు, సిబ్బంది, వార్డు ముఖ్య నాయకులుపాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలపై అవగాహన

సోంపేట: పంటకోత ప్రయోగాల నిర్వహణపై స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ బి.అప్పలస్వామి ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ అధికారులు, వ్యవసాయ సహాయకులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్, వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి మాట్లాడుతూ.. పంటకోత ప్రయోగాల కోసం గ్రామ రెవెన్యూ అధికారులను, గ్రామ వ్యవసాయ సహాయకులను ప్రాథమిక కార్యకర్తలుగా నిర్ణయించినట్టు చెప్పారు. గణాంకాధికారి ఎర్ర జోగారావు, ఎంపీడీఓ బి.వెంకటరమణ పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

టెక్కలి రూరల్: నందిగాం మండలం లఖిదాసుపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను టెక్కలి, పలాస డివిజన్ల ఉపవిద్యాశాఖాధికారి పి.విలియం సోమవారం సందర్శించారు. విద్యార్థుల భద్రత కోసం సిబ్బంది తీసుకుంటున్న జాగ్రత్తలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థుల ప్రగతిపై సిబ్బందితో సమీక్షించారు. ప్రధానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావు, ఉపాధ్యాయులు దుంపా శ్రీనివాస్, ఆర్.రామారావు, టి.ప్రసాద్, బి.రత్నం, ఎస్.గోవిందరాజులు, సంధ్యారాణి ఉన్నారు.

ఫ్లోరింగ్ టైల్స్ వితరణ

కంచిలి: మండలంలోని ఎస్.ఆర్.సి.పురం గ్రామంలో నూతనంగా అభివృద్ధి చేస్తున్న నిమ్మాసిని అమ్మవారి ఆలయంలో ఫ్లోరింగ్ నిర్మాణానికి అవసరమైన ఫ్లోరింగ్ టైల్స్‌ను సోంపేటలో స్థిరపడి వ్యాపారం చేస్తున్న కడప జిల్లా వాస్తవ్యులు ప్రతాప్ యాదవ్, విజయ్ యాదవ్ వితరణగా ఆలయ కమిటీకి ఇచ్చారు. సుమారు రూ. 40 వేల విలువైన టైల్స్‌ను ఆలయ కమిటీ ప్రతినిధులకు సోమవారం అప్పగించారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

ఇచ్ఛాపురం: రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ ఉలాల భారతిదివ్య అన్నారు. ఫకీర్‌పేటలో రూ.15 లక్షలతో నిర్మాణం చేస్తున్న రోడ్డు పనులను సోమవారం పరిశీలించారు. నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని కాంట్రాక్టర్‌కి సూచించారు. ఇంజనీర్ కామేష్, కాంట్రాక్టర్ నారాయణ ఉన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

పలాస: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో ఎస్.రమేష్‌నాయుడు చెప్పారు. బొడ్డపాడులో గ్రీన్ అంబాసిడరు, గ్రీన్ గార్డులను సోమవారం ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా ఎంపీటీవో మాట్లాడుతూ.. మండలంలో పరిశుభ్రత విషయంలో బొడ్డపాడు మొదటి స్థానంలో ఉందన్నారు. సర్పంచ్ తామాడ మదన్, ఎంపీటీసీ సభ్యుడు మద్దిల పాపారావు, పంచాయితీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం ఉన్నత పాఠశాలలో తమతో చదివిన బాల్య మిత్రుడు ఆపదలో ఉన్నట్లు తెలుసుకున్న స్నేహితులు స్పందించారు. చేయి చేయి కలిపి స్నేహితుడికి అండగా నిలవాలనుకున్నారు. 1994–95 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పి.నాగభూషణం అనారోగ్యంతో బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాల్య మిత్రులు రూ.30 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని సర్పంచ్ నర్తు వరప్రసాదరావు యాదవ్ ద్వారా నాగభూషణం కుటుంబ సభ్యులకు అందజేశారు.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపునకు చర్యలు

వజ్రపుకొత్తూరు: ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు ప్రశస్త యాప్ తీసుకొచ్చినట్లు సమగ్ర శిక్షా ఐఈఆర్పీ జిల్లా కోఆర్డినేటర్ బుడుమూరు గోవిందరావు అన్నారు. సోమవారం టచ్ టూల్‌కు సంబంధించి మండల రిసోర్సు కేంద్రంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం చేపట్టి పలు సూచనలు చేశారు.